## లైంగికదాడి కేసులో 20 ఏండ్ల జైలు

ఆసిఫాబాద్, డిసెంబర్ 18 : మైనర్ బాలికపై లైంగికదాడి చేసిన కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు, ప్రధాన న్యాయమూర్తి ఎం.వీ రమేశ్ సోమవారం తీర్పునిచ్చారు. డిస్ట్రిక్ట్ లైసెనింగ్ ఆఫీసర్, ఎస్సై సాగర్, సబ్ డివిజనల్ ఆఫీసర్ రాంసింగ్ కథనం ప్రకారం.. ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండిలో 2013లో మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన ఆసిఫాబాద్‌కు చెందిన వసంత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. సాక్ష్యాదారాలతో చార్జిషీట్ దాఖలు చేసి, పోక్సో కేసులో సాక్ష్యులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాద్ సాక్షుల విచారణ అనంతరం న్యాయమూర్తి నిందితుడికి 420, 376(2)(3) ఐపీసీ, పోక్సో చట్ట ప్రకారం సెక్షన్ నాలుగు కింద 20 ఏండ్ల జైలు శిక్షతో పాటు రూ. 30 వేల జరిమానా విధించారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677



ఎదులాపురం : అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్



ఆసిఫాబాద్ : వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

# సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

ఎదులాపురం, డిసెంబర్ 18 : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కారించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 21న హైదరాబాద్‌లో కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం ఉన్నందున అధికారులు తమ శాఖలకు సంబంధించి సంక్షిప్త సమాచారాన్ని రేపటిలోగా అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో హాజరు శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. అంతరం భీంపూర్ తహసీల్దార్ జే.నారాయణ గుండెపోటుతో మరణించినందున అధికారులతో కలిసి కలెక్టర్ రెండు నిముషాలు మౌనం పాటించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

### సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ**

ఆసిఫాబాద్,డిసెంబర్ 18 : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో డీఆర్వో కదం సురేశ్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా కేంద్రానికి చెందిన జూపాక సుజాత తన భర్త మరణించాడని, ఐదేళ్ల పాప ఉందని, ఏదైనా ఉపాధి చూపించాలని వినతి పత్రం అందించారు. సిర్పూర్ మండల కేంద్రంలోని న్యూ కాలనీకి చెందిన ప్రజలు విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని, తమకు న్యాయం చేయాలని కోరారు. బెజ్జూరు మండలం ముంజంపల్లి శివారులోని సర్వే నంబర్ 43లో తనకు సంబంధించిన మూడెకరాల విస్తీరంగల భూమి ఉందని, తన తండ్రి నుంచి కాస్తు చేస్తున్నామని, అయినప్పటికీ పట్టా పాస్ బుక్ లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తుందని మడావి సుమలత దరఖాస్తు చేసుకున్నారు. వారసత్వ భూమికి సంబంధించిన పట్టా పాస్ బుక్ మంజూరు చేయాలని కాగజ్‌నగర్ మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన పోతురాజుల ప్రమీల దరఖాస్తు చేసింది. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌లోని పాఠశాల, ఆసుపత్రి, చర్చి పరిసర ప్రాంతాల్లో వైన్ షాపు ఏర్పాటు చేశారని, దానిని వేరే చోటికి మార్చాలని కాలనీవాసులు వినతిపత్రం అందించారు. ఆసిఫాబాద్ మండలం రవిచంద్ర కాలనీకి చెందిన గైని లక్ష్మి.. తాను డిగ్రీ పూర్తి చేశానని, ఇద్దరు పిల్లలు ఉన్నారని, నూతన కలెక్టరేట్‌లో ఏదైనా పని ఇప్పించాలని కోరింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యులకు అండగా నిలవాలి

**ప్రజా ఫిర్యాదుల విభాగంలో నిర్మల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్**

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 18 : సామాన్య ప్రజలకు పోలీసులు అండగా నిలవాలని ఎస్పీ సీహెచ్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగం నిర్వహించారు. జిల్లాలోని వివిద ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎస్పీ ఓపికగా వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికిగాను ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించి పోలీసుల గౌరవం మరింత పెంచేలా కృషి చేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంఘ వ్యతిరేక చర్యలు తమ దృష్టికి వస్తే జిల్లా అధికారులకు వాట్సాప్ నం. 8712659599కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

# జూలీకి అంత్యక్రియలు

- పోలీసుశాఖలో విశేష సేవలందించిన జాగిలం
- నివాళులర్పించిన ఎస్పీ ప్రవీణ్‌కుమార్, పోలీసులు

సోన్, డిసెంబర్ 18 : జిల్లా పోలీసుశాఖలో విశేష సేవలందించిన జూలీ(జాగిలం)కి లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. 2018 నుంచి జూలీ పలు నేర పరిశోధనలో కీలకపాత్ర పోషించింది. ఇటీవల అనారోగ్యానికి గురికాగా.. మెరుగైన వైద్యం కోసం పోలీసులు కృషి చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. సోమవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో పాటు పోలీసులు జూలీకి నివాళులర్పించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 2016 అక్టోబర్ 14న జన్మించిన జూలీ.. రంగారెడ్డి జిల్లా కెనాయి ట్రైనింగ్ సెంటర్‌లో ఐఐటీఏ మెయినాబాద్‌లో 8 నెలల శిక్షణ పూర్తి చేసుకుందన్నారు. శిక్షణ సమయంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబర్చగా నిర్మల్ జిల్లా పోలీసుశాఖకు 2018 ఫిబ్రవరి 25న జూలీని కేటాయించారు. జాతీయస్థాయిలో పోలీసు డ్యూటీ మీట్‌లో పాల్గొని ప్రతిభ చాటిందని, జూలీ అనారోగ్యానికి గురై మరణించడం పోలీసుశాఖకు తీరని లోటని తెలిపారు. ఇదిలా ఉండగా మృతి చెందిన జూలీ అంత్యక్రియలను పోలీసుశాఖ ఆధ్వర్యంలో సంప్రదాయపద్ధతిలో నిర్వహించారు. పోలీసుల గౌరవవందనాన్ని సమర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు రాంనిరంజన్, రమేశ్, రామకృష్ణ, వినోద్, జాగిలాల సంరక్షకులు పాల్గొన్నారు.



జూలీకి నివాళులర్పిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

## గెస్ట్ లెక్చరర్ల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్,18 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికిగాను అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.జే.భీమారావు ఓ ప్రకటనలో తెలిపారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్(1), కెమిస్ట్రీ(1 ఉర్దూ మీడియం), పోస్టుల్లో చేరబోయేవారు ఆయా సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలున్నవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని, సంబంధిత సబ్జెక్టుల్లో బోధన అనుభవముంటే అదనపు అర్హతగా పరిగణిస్తారని పేర్కొన్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాలతో డిసెంబర్ 21న సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డిసెంబర్ 22న ఉదయం 11.30 గంటలకు ముఖాముఖి ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

## కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎదులాపురం, డిసెంబర్18 : పట్టణంలోని కుమ్రం భీం కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడం దెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సోమవారం కాలనీ నుంచి ర్యాలీగా తరలివచ్చి కలెక్టరేట్‌ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమ సమస్యలను ప్రస్తావిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టగా ఆందోళనకారులు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ అక్కడికి చేరుకొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుమ్రం భీం కాలనీలో నివసిస్తున్న ఆదివాసీల ఇండ్లకు ఇంటి పట్టాలు అందించడంతో పాటు కనీస వసతులు కల్పించాలని తుడం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గొడం గణేశ్ కోరారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

## బియ్యం పట్టివేత

కౌటాల, డిసెంబర్ 18: మండలంలోని తలోడి గ్రామ సమీపంలో బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్, శ్యాంలాల్ తెలిపారు. సోమవారం ఉదయం తలోడి క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, టాటా ఏస్‌లో తరలిస్తున్న 21 బస్తాల్లో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. నిందితులు గోపాల్, అంజయ్య, ఆశాలు, కిషోర్, దేవాజీ, భీమయ్య, లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## యువతి ఆత్మహత్య

దస్తురాబాద్, డిసెంబర్ 18 : తల్లి మందలించారని ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన దస్తురాబాద్ మండలం దేవునిగూడంలో జరిగింది. ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి కథనం ప్రకారం.. దేవునిగూడెంకు చెందిన పానగంటి సాత్విక(22)కు ఇటీవల ఎంగేజ్‌మెంట్ అయ్యింది. కొద్ది రోజుల్లో వివాహం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో ఈ నెల 16న పెండ్లి తేదీ దగ్గరకు వస్తుంది.. ఇంట్లో ఉండి ఏం పనిచేస్తలేవు అంటూ తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన సాత్విక అదే రోజు కడెం వెళ్లి పురుగుల మందు తెచ్చుకొని తాగింది. స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో మరణించింది. ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించారు. సాత్విక తండ్రి పోశన్న కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి ఇద్దరు కూతుళ్లు, కుమారుడిని కష్టపడి పెంచింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సాత్విక(ఫైల్)

## పడిపోతున్న పత్తి ధర

ఇంద్రవెల్లి, డిసెంబర్18 : మార్కెట్‌లో రోజురోజుకూ పత్తి ధర పడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వానాకాలంలో సాగు చేసిన పత్తి పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర పలకడం లేదు. ప్రభుత్వ రంగసంస్థ సీసీఐ రూ. 7,020 ధర నిర్ణయించగా, వ్యాపారస్తులు మాత్రం పత్తి క్వింటాలుకు రూ. 6,700 నుంచి రూ. 6,750 వరకే కొనుగోలు చేస్తున్నారని పత్తి విక్రయించిన రైతులు తెలుపుతున్నారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తి క్వింటాలుకు రూ. 9 వేలు చెల్లించి కొనుగోలు చేయాలని పత్తి రైతులు కోరుతున్నారు. సరైన ధర చెల్లించకుండా.. కోతలతో పాటు హమాలీ పేరిట డబ్బులు వసూళ్లు చేసి రైతులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

